# సినిమా చూసి వచ్చిన తరవాత-

తోట వెంకటాద్రి

నేనొక్కణ్ణే చూచి తరిస్తే సబబుగా ఉండదనీ, దాన్ని చూపించి నాతోబాటు సమానంగా తరింపచేసే ఉద్దేశ్యంతో, "సంసారాన్ని ససారం చేస్తున్న మసారసార నయన్ను" గూడా రానంటున్నకొద్దీ సినిమాకు తీసుకవెళ్లాను. కొండొక కారణాన, మసారసార నయనకు సినిమాలంటే చాలా అసహ్యాం కలిగింది. సినిమా చూచి యింటి కొచ్చేటప్పుడే, తన రుసరుసలు బుసబుసలుగా ఉండడం గమనించి, యిక ఆ రుసరుసా బుసబుసలు యింటి కొచ్చింతర్వాత ఓ ప్రళయప్రభంజనంలోకివిజృంభించడం అత్యంత సంభవం అనుకొన్నాను.

నేననుకొన్నట్లే జరిగింది. ఇంటికొచ్చింతర్వాత, సినిమాకు వెళ్ళేముందేతయారుచేసిపెట్టుకొన్న యెగ్రజొన్న రొట్టెలు, పొద్దుటప్రొద్దుట మిగిలిన పాలకూర పప్పుతో కళ్లు మూసుకుని మింగి, నేను శేషశాయి పోజులో మంచంమీద పండుకొని, చూచి వచ్చిన సినిమాను సింహావలోకనం చేసుకుంటున్న సమయంలో, తానూ త్వరత్వరగా పని ముగించుకొని సతీతిలకం నాదగ్గరకొచ్చి ప్రశ్నించింది, "ఏమండీ సినిమా యెట్లా ఉంది" అని.

"నువ్వు గూడా చూశావుగా. ఎట్లా ఉందేమిటి?" అన్నాను, ప్రారంభం అయిందిరా బాబూ అనుకుంటూ. "నాకెట్లాఉంటేయేంలే. చాలా కష్టపడి చూపించారు పాపం. ఎట్లా ఉందో చెబుదురూ!"

"మహా బాగా ఉంది."

"మీకు ఒక సినిమా మాత్రం బాగుండకుండా ఉందా! అయితే అంత ఇదిగా దాన్ని సిఫార్సుచేశారు గదా చూడాలని..." అంటూ ఆవిడగారు అంటుంటే,

"అవును దాన్ని నడిపించింది దిగ్దంతిలాంటి ఓ దర్శకుడు. కథా, పాటలూ, మాటలూ రాసింది కొమ్ములు దిరిగిన కవులూ, రచయితలూనూ. అందులో వీరంతా ప్రగతిశీలురూ, ప్రతిభాశాలురున్నూ. కాబట్టి..."

"కాబట్టి యిన్ని విశేషణాలతో కూడుకొన్న ఆ సినిమా, యీ నిరాశాతృషిత హృదయాలకు ఓ వినూత్న సందేశం యిచ్చి ఊరడిస్తుందని..."

"అయినా యిప్పుడేమయింది కనక? విలక్షణంగా ఉంది సినిమా!" అన్నాను.

"ఇంత విలక్షణంగా ఉంటుందని ఉబలాటపడుతూ వెళ్లాంగదా, దానివల్ల మనం యేం నేర్చుకున్నాం? ఆ ప్రగతిశీలురూ, ప్రతిభాశాలురూ అందులో తెచ్చిన ప్రగతీ, చూపించిన ప్రతిభా యేమయినా ఉన్నాయా? ఆ కథ సమాజానికేమయినా ఉపయోగపడుతుందా?" అని మసారసారనయన అడుగుతూంటే, ఇదేదో పన్నెండు గంటలదాకా చంపేట్లుందని దృఢపడి, "సరే రేపాలోచిద్దాం గాని పడుకో యిహ నిద్రొస్తూంది" అంటూ నేనుఅటువైపుకు తిరిగి పండుకొన్నాను.

"నిష్కారణంగా డబ్బులు దండగైనై. సినిమా చూచిహతాశనయ్యాను యెందుకోస్తినా అనిపించింది" అంటూ మళ్ళీ యెత్తుకొంది.

"యేం?" అన్నాను మరిచిపోయి.

"యేమంటారేమిండీ? యెన్ని పక్కలకు తిప్పితిప్పి చూచినా, కథలో అసాధారణత్వం యేమన్నా ఉందా? ఒక అమెరికను వనిత వ్రాసిచ్చినట్లు, "కులాల్లోని కల్లోలాల్ను, గందరగోళాల్నూ, చికాకుల్నూ తెలిపే సెంటిమెంట్లతో కూడుకొన్న గాథ" లకన్నా యేం మించిపోయింది? వాటినే యిది యింకో పితలాటకంతో చిత్రించింది. ఆ ప్రగతిశీలురు అసలీ కథను రాయడానికెట్లా ఒప్పుకున్నారా అని! మన సుదర్శనాన్ని అడిగినా ఆ మద్రాసు పితలాటకాలతో యీ హైద్రాబాదు గడబిడల్నికూడ జోడించి ఆ కథను, ఆ శక్కిలో

ఆ కత్తులో దానికంటే వేయిమడుగు లెక్కువగా రక్తి కట్టేటట్లు రాసేవాడు. వింటున్నారా నేం చెబుతూంది?"

"ఆహా వింటున్నాను గాని యిహ..."

"అబ్బ యెప్పుడూ నిద్రే! రేపు ఆఫీసుకి సెలవేగా. సరే గాని అసలు సినిమాలంటే మీ అభిప్రాయం ఏమిటి?" అంటూ సంభాషణ పొడిగించింది పక్కనే కూర్చుని.

"సినిమాలన్నవి ఒక పరిశ్రమే కాకుండా, వివిధ కళా సమన్వితాలు; వినోద విజ్ఞాన సంధాయకాలు; సమాజాభ్యున్నతి కుపయుక్తమయ్యే ఉన్నత ప్రమాణంగల సాధనాలు" అన్నాను క్లుప్తంగా కళ్లు మూసుకునే.

"అయితే నేటి సినిమాలు నిజంగా కళాభివృద్ధిని చేస్తున్నయ్యా? నిజంగా సమాజాభ్యున్నతికి తోడ్పడుతున్నయా?"

"నువ్వేచెప్పు జవాబు కూడా!"

"బుజాలమీద తలకాయ ఉన్న యే వ్యక్తీ అవునని చెప్పలేడు. నేటి సినిమాలు వ్యాపార దృష్ట్యా తీయబడ్డం లేదంటూరా?"

"కావచ్చు" అన్నాను అడ్డు చెప్పకుండా వుంటే తాను చెప్పదలచుకొన్నది త్వరలో పూర్తి అవుతుందని.

"కళను ఖూనీ చేయడం లేదంటూరా?"

"కావచ్చు."

"యేదో కొరగాని వినోదాన్ని కల్గించి ప్రజానీకం తమ శ్రమశక్తిని అమ్ముకొనగా వచ్చిన ఆ కాసిని డబ్బుల్ని దోచుకుంటున్నై యీ సినిమాలు."

"కావచ్చు శ్రీమతీ, కావచ్చు."

"సమాజాభ్యుదయం మాట అటుంచి సమాజాన్ని పాతాళభైరవీ పాదాబ్జ సన్నిధిని పడేస్తున్నాయి నేటి సినిమాలు."

"కావచ్చు."

"మేధావులు తమ నైపుణ్య శ్రమశక్తిని అమ్ముకొని పెట్టుబడిదారుల ట్యూడియోల్లో తయారు చేస్తున్న వర్తకపు సరకులు నేటి సినిమాలు."

"కావొచ్చు."

"ఆదర్శం, ఆదర్శం అంటూ కైలాసగిరి నుండి కన్యాకుమారి దాకా, 'నువ్వూ, నేనూ, మరొకరూ' అంతా మిరపకాయలు తిన్న కాకులకు మల్లే అరవడం తప్పితే వాస్తవిక జీవితంలో ఆదర్శాన్ని చూపిస్తున్నది ఎవ్వరూ లేరు. ఆచరణలో ఆదర్శానికి వ్యతిరేకంగా నడవడమో, లేక దాన్ని బుద్ధి పూర్వకంగా చంపెయ్యడమో జరుగుతుంది. మనిషియొక్క ఆలోచనలనూ, మాటలనూ బట్టి కాక, అతను చేస్తున్న పనుల్నిబట్టే అతన్ని జడ్జ్ చేయాలని లెనిన్ మహాశయుడు చెప్పాడు యిందుకనే."

"కావచ్చు."

"కేవల కల్పనా కథలు, కృత్రిమ వేషాల వల్ల వచ్చే ప్రగతి ఏముంటుంది? 'ఎంతటి మేటి కవిత్వమేని స్వజ్యోతి బహిర్గతంబగుట చొప్పడకున్న నిరర్థకం' గాకపోతే కరేపాకు కాడకు పనికొస్తుందా? మీరు మిక్కిలి అది సమాజాభ్యుదయాన్ని అరికట్టుతుంది. ప్రజా ద్రోహానికి దారితీస్తుంది. ప్రజలయొక్క అజ్ఞానాన్ని ఊతగాగొని, పెట్టుబడిదారులు కొల్లకొల్లలుగా లాభాలు గుంజుకోడానికి దోహదం చేస్తుంది. అందుకనే మేధావులైనవారు తమ విజ్ఞాన సంపత్తిని పతిత మానవోద్ధరణకే వినియోగించాలిగాని, దాన్ని బూర్జువాల కమ్ముకోకూడదని లెనిన్ మహాశయుడు పదేపదే నొక్కినొక్కి చెబుతున్నాడు."

"కావొచ్చు."

"చాల్లెస్తురూ మీకంతా హాస్యం, నెటకారమున్నూ. యేమిటి అస్తమానం కావచ్చు, కావచ్చు, ననుకుంటూ" అంటూ శ్రీమతి లేచి రెండు గ్లాసులు మంచినీళ్లు త్రాగి, పండుకొని తన మసారసార నయనాల్ని మూసుకుందిగామాలు మళ్ళీ కాస్సేపటిదాకా ఆ విషయం యెత్తలా.

ఇహ మనం మళ్ళీ మాట్లాడితే రెండింటిదాకా దుంప తెగుతుందేమోనని చప్పుడు లేకుండా నేనూ నిద్రబోయాను.

గాడిద వేరు చివర ఎన్ని కాలేజీ డిగ్రీలు తగిలించినా, దాని చెవ్వుల పొడుగు మాత్రం తగ్గదు